ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు

చైతన్యపురి: ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి ముగ్గురికి చోటు దక్కింది. ఇటీవల జరిగిన 43వ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా అజయ్, సతీష్, రాకేష్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అసమర్థత వల్ల గురుకుల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. రెసిడెన్షియల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేలండర్ ఆవిష్కరణ



నాగోలు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ నిరంతరం కృషి చేస్తోందని ఉప్పల్ మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రేమ్ కుమార్, మైఖేల్ రెడ్డి అన్నారు. నూతన సంవత్సరం కేలండర్‌ను శనివారం నాగోలు, కొత్తపేట, జైపురికాలనీలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆవిష్కరించారు. త్వరలో మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, పిచ్చిరెడ్డి, రామ్‌నాథ్‌రెడ్డి, బత్తుల శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, మధుసూదన్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నియామకం

నాగోలు: విద్యార్థుల రాజకీయ పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షులు, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి గోగికర్ అనిల్, జీహెచ్‌ఎంసీ అధ్యక్షుడిగా భాగవతుల సాయిమహేష్, జాయింట్ సెక్రటరీగా నందాల అనిల్‌ను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు యేచ్చు సునీల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, సమాజం కోసం అహర్నిశలు కష్టపడే వారికి విద్యార్థుల రాజకీయ పార్టీ మంచి స్థానాన్ని కల్పిస్తూ, భవిష్యత్‌లో ఎంతోఎత్తుకు ఎదగాలని కోరుకుంటుందన్నారు.

మహాసభలకు తరలిన నాయకులు



మహాసభలకు వెళ్తున్న నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: ఇబ్రహీంపట్నంలో జరిగే సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా 10 వ మహాసభలకు ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ నుంచి పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. శనివారం, ఆదివారం జరిగే సీపీఎం జిల్లా మహాసభలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యలపై చర్చించి భవిష్యత్‌లో ప్రజా సమస్యలపై పోరాటం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్, వెంకన్న, శ్రీనివాస్, గోపినాయక్, వీరయ్య, రాములు, పరుశరాములు, యాదయ్య, చైతన్య, లతీఫ్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

నాగోలు: నాగోలు డివిజన్ శ్రీ సాయినగర్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు రాజా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవుడి నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారిగా మహాత్మారెడ్డి, ఉపాధ్యక్షులు రాఘురాంరెడ్డి, గామ్మిరెడ్డి నరసింహారెడ్డి, ఎస్. మధుకర్‌రెడ్డి, సెక్రటరీ కొండ బత్తుల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీధర్, జాయింట్ సెక్రటరీగా వెంకటరమణ, కల్చరల్ సెక్రటరీస్‌గా కృష్ణమూర్తి, శ్రీనివాస్ రావు, మహిళ సెక్రటరీగా బండి అజిత, కార్యవర్గ సభ్యులుగా సత్యనారాయణ, తదితరులను ఎన్నుకున్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..
టమాటా రూ.11, వంకాయ రూ.23, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.17, క్యారెట్ రూ.25, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.35, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.37, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.28, కీర రూ.13, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.43. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

విద్యుత్ వైర్లు బిగిస్తుండగా విరిగిన స్తంభం

నాలుగు బైక్‌లు, ఆటో ధ్వంసం - ఒకరికి గాయాలు

నాగోలు: కొత్త విద్యుత్ వైర్లు బిగించే క్రమంలో చెట్ల కొమ్మలు పడి స్తంభం విరిగిపోయింది. ఈ ఘటనలో ఓ వ్యక్తికి గాయాలు కాగా పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆటోనగర్ సబ్ స్టేషన్ నుంచి శివగంగా కాలనీకి విద్యుత్ శాఖ అధికారులు శనివారం బ్యాక్ ఫీడర్ (అదనపులైన్) 11 కేవీ నూతన లైన్ బిగించే పనులు కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డికి అప్పజెప్పారు. ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ దగ్గర అభినందన గ్రాండ్ హోటల్ వద్ద వైర్లు బిగిస్తున్నారు. విద్యుత్ స్తంభంపై మల్లాపూర్‌కు చెందిన గణేష్ పని చేస్తున్నాడు. పక్కనే ఉన్న చెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లపై పడిపోవడంతో స్తంభం విరిగిపోయింది. స్తంభంపై ఉన్న గణేష్ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే పార్కింగ్ చేసిన నాలుగు ద్విచక్ర వాహనాలు, ఓ ఆటో ధ్వంసమయ్యాయి. గాయపడిన గణేష్‌ను వెంటనే కామినేని హాస్పిటల్‌కు తరలించారు. విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వల్లనే స్తంభం విరిగిపోయిందని, ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా కాంట్రాక్టర్ పనులు చేస్తున్నాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైర్లు కిందపడిపోవడంతో ఎల్‌బీనగర్ అభినందన గ్రాండ్ హోటల్ వద్ద భారీగా ట్రాఫిక్ స్తంభించింది.



బైక్‌లు, ఆటోపై పడ్డ విద్యుత్ స్తంభం

డివిజన్ అభివృద్ధికి రూ.1.52 కోట్లు మంజూరు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అత్యధికంగా జీహెచ్‌ఎంసీకి పన్నులు వసూలవుతున్నాయని ఆ స్థాయిలో నిధులు మంజూరు కావటం లేదని బీజేపీ కార్పొరేటర్ల పోరాటంతో మన్సూరాబాద్ డివిజన్‌కు రూ.1.52 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారాహిల్స్, జుబ్లీహిల్స్, కోకాపేటలో ఉన్న పన్నుల మాదిరిగానే ఎల్‌బీనగర్ ప్రజలు చెల్లిస్తున్నారని, జీహెచ్‌ఎంసీ ఈ నిధులను ఓల్డ్‌సిటీకి మళ్లించి ఎల్‌బీనగర్‌కు మొండి చేయి చూపుతున్నారని విమర్శించారు. గత నెలలో



కొప్పుల నర్సింహారెడ్డి

జరిగిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని అడ్డుకోవడంతో పాటు ఈ నెలలో ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌ను ఆయన కార్యాలయంలోకి రాకుండా అడ్డుకుని నిరసన తెలపడంతో గత ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేశారని స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్‌కు 100 వీధీ దీపాలు మంజూరు అయ్యాయని, త్వరలోనే వాటిని ఏర్పాటు చేస్తామన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడమే లక్ష్యం

హయత్‌నగర్: సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని సమాచార హక్కు చట్టం పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు, సెక్రటరీ ధర్మరాజు అన్నారు. హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్ మెట్టు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జాతీయ స్థాయిలో అవగాహన కల్పించేందుకు అన్ని రాష్ట్రాల్లో సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉంటేనే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయన్నారు. ఎన్నికల్లో అక్రమాలను నిర్మూలించేందుకు సీ-విజిల్ యాప్‌ను వినియోగించడంపై ప్రచారం చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు చేసిన కృషికి ఎన్నికల కమిషన్ అభినందించడం గర్వకారణం అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రభుత్వం పుడమి రత్న అవార్డుతో సత్కరించిందని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణులను చైతన్యం చేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా సమాచార హక్కు పరిరక్షణ సమితి కోఆర్డినేటర్‌గా కల్వల హరికృష్ణముదిరాజ్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మధుసూధనాచారి, ఎస్సై సైదులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేశవులు ముదిరాజ్

రాజీవ్ స్వగృహ స్థలాన్ని కబ్జా చేస్తున్నారంటూ ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న అధికారులు

నాగోలు: బండ్లగూడ పరిధిలోని రాజీవ్ స్వగృహ స్థలాన్ని కొంతమంది హద్దులు చెరిపి కబ్జా చేస్తున్నారని నాగోలు బండ్లగూడలోని రాజీవ్ స్వగృహ నివాసితులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజీవ్ స్వగృహ ఫోర్త్ బ్లాక్ కోసం కేటాయించిన స్థలాన్ని కొంతమంది ప్రహరీ తొలగించి కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారని ఇదే విషయాన్ని రాజీవ్ స్వగృహ కిందిస్థాయి అధికారులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడ జరుగుతున్న పనులను స్వగృహ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అనిల్‌తో నిలిపివేయించారు. అనిల్ మాట్లాడుతూ.. కబ్జాకు గురైనట్లు వస్తున్న ఆరోపణలపై రెవెన్యూ అధికారులను సర్వే కోసం కోరుతామన్నారు. ఆందోళనలో రాజీవ్ సహభావన టౌన్‌షిప్ బ్లాక్‌లకు చెందిన కమిటీ సభ్యులు శ్రీనివాస్ రావు, నరేష్, చెరుకూరి శ్రీనివాస్, నల్ల మునిందర్, సూరెపల్లి గోపి,నల్ల సాయికుమార్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

తరంగోత్సాహం!





సాక్షి, సిటీబ్యూరో: కొత్తపేటలోని ఓక్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్ 12వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. 'తరంగ్' పేరుతో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక, నృత్య, సాహస ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా 'కత్తులు బల్లెం చేతబట్టి' అనే తెలంగాణ జానపద పాటకు మూడో తరగతి విద్యార్థుల బృందం చేసిన ప్రదర్శన అలరించింది. అనంతరం ఐదో తరగతి విద్యార్థులు టైల్స్‌ను తలతో పగలగొట్టడం, ఫైర్ జంప్ వంటి కరాటే విన్యాసాలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడారు. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఐజీఎన్‌ఓయూ) సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, స్కూల్ చైర్మన్ ఎస్. లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి

సహకారం సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి

బడంగ్‌పేట్: బాలాపూర్ సహకార సంఘం బలోపేతానికి అందరం కలిసి కృషి చేస్తున్నామని సహకారం సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి అన్నారు. శనివారం బాలాపూర్‌లోని బండ్లగూడ ఖాల్సా బాలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమావేశాన్ని సంఘం బ్యాంక్ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం నూతన సంవత్సర కేలండర్, డైరీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెంటారెడ్డి మాట్లాడుతూ.. రూ.42కోట్ల టర్నోవర్‌తో బాలాపూర్ సహకారం సంఘం కార్యకలాపాలను కొనసాగిస్తున్నామన్నారు. ఏటా రూ.28లక్షల నికర ఆదాయంలో ముందుకెళ్తున్నామని తెలిపారు. త్రిపుల్‌ఎస్ ఖాతాలను ప్రారంభించి రైతులు, గ్రామస్తులకు మేలు చేస్తున్నామని పేర్కొన్నారు. బాలగణేష్ పథకం ద్వారా చిన్నారుల పేరుతో ఖాతాలు తెరిచి ఇతర బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకి అందజేస్తున్నామన్నారు. రైతులకు స్వల్ప, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందజేస్తున్నామని తెలిపారు. సహకార సంఘాన్ని ఇల్లాలోనే ఉత్తమ సహకార సంఘంగా నిలబెట్టామన్నారు. ఈ మల్టీపర్పస్ కింద సహకార సంఘాల సేవలను గుర్తించిన పలు విదేశీ సంస్థలు, మన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన సహకార సంఘాల వారు అధికారులతో కలిసి ఇక్కడకు వచ్చి బాలాపూర్ సహకార సంఘాన్ని ఎలా అభివృద్ధికి బాటలు వేశారో తెలుసుకొని వెళ్తున్నారని గుర్తుచేశారు. మహిళల పొదుపు సంఘాల వారికి రుణాలు కూడా అందిస్తున్నామన్నారు. సేఫ్‌లాకర్ల సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తులు, సంఘం సభ్యులు పాలకవర్గం ఆశీస్సులతో సహకారం సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొలన్ తిరుపతిరెడ్డి, పాలకవర్గ సభ్యులు కొత్తం నిరంజన్‌రెడ్డి, కొత్తం లక్ష్మారెడ్డి, కొంతం అరుణరెడ్డి, నిరుడి నర్సమ్మ, రావుల లింగం, కొంతం సంపత్‌రెడ్డి, ఇబ్రాం బాలయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, సీఈఓ ఎర్ర జైహింద్, శ్రీకాంత్, రాధ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలను కాపాడతాం



శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్

హస్తినాపురం: నేరాలను అదుపుచేసి శాంతిభద్రతలను కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతిరోజు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్త సంవత్సరం సందర్భంగా స్నేహితులు, ఆప్తులు పంపించే శుభాకాంక్షలు, పెద్ద పెద్ద షాపులు ప్రకటించే ఆఫర్లను మోసాలకు మార్గాలుగా సైబర్ నేరగాళ్లు మార్చుకునే ప్రమాదం ఉందని ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు తమ వివరాలు ఇవ్వరాదన్నారు.ఫోన్‌లకు వచ్చే గుర్తు తెలియని లింక్‌లను ఓపెన్ చేయరాదన్నారు.

వినతి



వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

లింగోజిగూడ: మణిపురి కాలనీలో డైరీ ఫాం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని శనివారం కాలనీవాసులు ఎల్‌బీనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. డైరీ ఫాం ఏర్పాటు చేస్తే దుర్వాసనతో పాటు చుట్టు పక్కల దుర్గంధంగా మారుతుందన్నారు. దీంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే ప్రమాదం ఉందని డైరీఫాం ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో పెంటయ్య, ఆనంద్‌రాజ్, దుర్గమ్మ, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, మధు ఉన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

సైదాబాద్: ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం కంచారం గ్రామానికి చెందిన సింహాద్రి (22) సైదాబాద్ వినయ్‌నగర్ కాలనీలోని అభినయ్ మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. హాస్పిటల్‌కు సమీపంలోనే గది అద్దెకు తీసుకొని నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి నుంచి తండ్రి మల్లేష్ అతడికి పలుమార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు. శనివారం ఉదయం మళ్లీ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆందోళనకు గురై హాస్పిటల్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. సహచర సిబ్బంది సింహాద్రి గది వద్దకు వెళ్లి కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదన్నారు.

ఆడపిల్లకు చదువే ఆయుధం

బడంగ్‌పేట్: ఆడపిల్లలకు చదువే ఆయుధమని, బాలికలు తమ విద్యను పూర్తి చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ అన్నారు. శనివారం బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో చైల్డ్ రైట్స్ అండ్ యూ, బాలల హక్కుల జిల్లా కో-ఆర్డినేటర్ కొమ్ము తిరుపతి ఆధ్వర్యంలో బాలికలు చదువుకోవాలిఅనే కాన్సెప్ట్‌తో కూడిన వాల్‌పోస్టర్‌ను ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బాలికలు బాగా చదువుకొని, ఉన్నత రంగాల్లో రాణించాలని సూచించారు. బాల్యావివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అమ్మాయిల చదువు దేశానికి వెలుగని, వారిని చదువులో తల్లిదండ్రులు ప్రోత్సహించాని సూచించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జిల్లా నాయకులు సల్వాది రమేష్, జర్పుల కృష్ణ ఉన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

వనస్థలిపురం: జనప్రియ హోమ్స్ కాలనీలో రోడ్డు ఆక్రమణలు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించే వ్యాపార సంస్థలపై తగిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. జనప్రియ హోమ్స్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ పాల్గొనగా రోడ్డు నెం-1లో నివాసిత ప్రాంతంలో నెట్ క్రికెట్‌ను ఏర్పాటు చేస్తున్నారని, దీనివల్ల అక్కడికి వచ్చే ఆటగాళ్ల వాహనాల పార్కింగ్‌తో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని కాలనీనాయకులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అర్ధరాత్రి వరకు ఫ్లడ్ లైట్ల వెలుగులో క్రికెట్ ఆడడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారని ప్రధాన రహదారిలో టీ, టిఫిన్ సెంటర్లు, స్థానికంగా ఉన్న కాన్ఫరెన్స్ హాల్లో జరిగే వివిధ కార్యక్రమాలతో ఇష్టానుసారంగా తమ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. స్పందించిన కార్పొరేటర్ టౌన్‌ప్లానింగ్ అధికారులతో మాట్లాడి ఆక్రమణలను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎన్.బ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శి ఎస్.పవన్‌కుమార్, ఉపాధ్యక్షులు ఠాగూర్, నరసింహులు, కోశాధికారి వినయ్‌కుమార్, విఠల్‌రావు, సురేంద్ర కులకర్ణి, వెంకట్‌రావు, వెంకటేశ్వర్‌రావు, సాంబశివరావు, కోటేశ్వర్‌రావు, నవీన్, లోకేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓఎస్ కాలనీలో కొనసాగుతున్న రోడ్డు పనులను శనివారం ఆయన కాలనీవాసులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీల్లో గుంతలుగా ఉన్న రోడ్లను పరిశీలించి మరమ్మతు చేపడుతున్నామని, అవసరం ఉన్న చోట నూతన రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. కాలనీలలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శరత్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, నికేతన్‌రెడ్డి, వేణు, శ్రీకాంత్, ఉదయ్, వినయ్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి..

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి శనివారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోజు రోజుకు శివారు ప్రాంతాల్లో నూతన కాలనీలు ఏర్పడుతున్నాయని మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు అవసరమన్నారు.

అవయవదానంపై అవగాహన కల్పించాలి

మన్సూరాబాద్: అవయవదానంతో ఎంతో మందికి పునర్జన్మ అందించవచ్చని, అవయవదానంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, జీవన్‌ధాన్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.భానుచంద్ర అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవయవదానంపై అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అవయవదానంపై అపోహలు వద్దని, బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల అవయవాలతో ఎంతో మందికి పునర్జన్మ లభించిందన్నారు. అవయవదానంపై అవగాహన కల్పిస్తే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తారన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశ్రాంత ఉద్యోగి రాఘవరెడ్డి శరీరదానానికి ముందుకు రావటంతో ఫౌండేషన్ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసన్ ఐ బ్యాంక్ మేనేజర్ అరవింద్‌కుమార్, సహారాస్టేట్స్‌కాలనీ మెయింటనెన్స్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, సీనియర్ సీటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, కార్యదర్శి విశ్వనాథం, కోశాధికారి ప్రకాష్, మాజీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్, శీనయ్య, రామన్‌గౌడ్, డాక్టర్ వెంకటేశ్వర్లు, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.



రాఘవరెడ్డిని సన్మానిస్తున్న ప్రతినిధులు

వైభవంగా మహాలింగార్చన, రుద్రాక్షాభిషేకం



రుద్రాక్ష అభిషేకం చేస్తున్న పండితులు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి జనప్రియ ఎన్‌క్లేవ్‌కాలనీలో వేదహవనం సహిత గజేంద్రమోక్ష ప్రవచన పాంచిహ్నిక జ్ఞానయజ్ఞ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం మహాలింగార్చన, మహాశివుడికి రుద్రాక్షాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భద్రచల ఆస్థాన వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు ప్రవచనాలు చేశారు.

- వైదిక విజ్ఞాన ట్రస్ట్, ధర్మరక్ష సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ ఉత్సవాల్లో ఆదివారం రుక్మిణి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తాం

చైతన్యపురి: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్, ఎల్‌బీనగర్ ప్రాంతాల నుంచి ఐఎస్‌సదన్ వైపు నడిపే 300 మంది ఆటో డ్రైవర్లు శనివారం చైతన్యపురిలోని కార్యాలయంలో మల్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు, బీఎన్‌రెడ్డినగర్, ఎల్‌బీనగర్ నుంచి ఐఎస్‌సదన్‌కు నడిపే ఆటోలను గత మూడు రోజులుగా పోలీసులు ఎస్ఎన్‌రెడ్డి గార్డెన్స్, గ్రీన్‌పార్క్ కాలనీ వరకే అనుమతిస్తున్నారన్నారు. ఆటో డ్రైవర్ల జీవనాధారంపై ప్రభావం పడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐఎస్‌సదన్ వరకు అనుమతించేలా చూడాలని కోరగా త్వరలో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసిన ఆటో డ్రైవర్లు

చితికిన కుటుంబాలకు చేయూత



నిత్యావసరాలు, కుట్టు మిషన్ అందజేస్తున్న రాము, యశస్విని జొన్నలగడ్డ

మన్సూరాబాద్: వివిధ కారణాలతో కుటుంబ జీవనం గడవటం కష్టంగా మారి చితికిన కుటుంబాలకు చేయుతనిస్తున్నామని రైస్ ఏటీఎం నిర్వాహకుడు, సామాజిక కార్యకర్త దోసపాటి రాము అన్నారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌హిల్స్‌కాలనీలోని రైస్ ఏటీఎం వద్ద శనివారం బియ్యం, నిత్యావసర సరకులతో పాటు, కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు, టీ స్టాల్లను అందించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. గత నాలుగేళ్లగా సుమారు నాలుగు వేల కుటుంబాలకు చేయూతనిచ్చామన్నారు. 5 కుట్టు మిషన్లు, 4 తోపుడు బండ్లు, 1 టీస్టాల్‌ను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రిషా అధ్యక్షురాలు యశస్వీనీ జొన్నలగడ్డ, వలంటీర్లు రాఘువేంద్ర, సూర్య, రాఘవ పాల్గొన్నారు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

నాగోలు: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హుక్కాసెంటర్‌పై పోలీసులు దాడిచేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. నాగోలు పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని భవానీకాలనీ చెందిన సాయికిరణ్‌గౌడ్ నాగోలు బండ్లగూడ ఇంద్ర ప్రస్థకాలనీలో బ్లాక్ అండ్ వైట్ కేఫ్ పేరుతో హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం రాత్రి హుక్కా సెంటర్‌పై దాడి చేసి రఘు, నందన్ శర్మ క్యాషియర్లను అరెస్టు చేసి విచారించగా నిర్వాహకులు నాంపల్లికి చెందిన శివప్రసాద్, భవానీకాలనీ చెందిన సాయి కిరణ్‌గౌడ్‌లను గుర్తించారు. ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.